సాక్షి తిరుపతి

బుధవారం । 26 । జూన్ । 2024



విత్తనం.. పక్కాగా విక్రయం

జిల్లాలోని లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని అధికారులు సూచించారు. - 8లో



అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు


సూళ్లూరపేట మండలం కొరిడి గ్రామం వద్ద మంగళవారం ఓ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు దిగేసింది. - 8లో



విధుల్లోకి అకడమిక్ కన్సల్టెంట్లు

తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో అకడమిక్ కన్సలెంట్లు మంగళవారం కోర్టు ఆదేశాల మేరకు విధుల్లో చేరారు. - 8లో


టెన్షన్.. అడ్మిషన్



గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యారంగం కొత్త పుంతలు తొక్కింది. ఈ క్రమంలోనే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ జూన్ నాటికి అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేసేది. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించేది. అయితే ప్రస్తుత టీడీపీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఆదిలోనే అయోమయ పరిస్థితులు కల్పించింది. ప్రధానంగా డిగ్రీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయడంలో జాప్యం వహిస్తోంది. విద్యాసంవత్సరం ఆరంభమైనా అర్థరహిత కారణాలతో కాలయాపన చేస్తోంది. చివరకు ప్రైవేట్ కాలేజీల ఉచ్చులోకి పిల్లలను బలవంతంగా నెట్టేస్తోంది.

- టీడీపీ సర్కారు నిర్లక్ష్యంతో ఉన్నత విద్యకు కష్టాలు
- డిగ్రీ ప్రవేశాలపై అయోమయం
- ఇప్పటి వరకు స్పందించని విద్యామండలి అధికారులు
- ఇంటర్ ఫలితాలు విడుదలై 73 రోజులు గడచినా పట్టించుకోని ప్రభుత్వం
- దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్న విద్యార్థులు
- ఫీజుల కోసం గాలం వేస్తున్న ప్రైవేట్ కాలేజీలు





తిరుపతి సిటీ : విద్యాసంవత్సరం ప్రారంభమైనా డిగ్రీ అడ్మిషన్లపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. టీడీపీ సర్కారు పట్టించుకోకపోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. చివరకు చేసేదేమీ లేక చాలామంది విద్యార్థులు ప్రత్యామ్నాయ కోర్సుల వైపు చూస్తున్నారు.

73 రోజులు గడచినా..

ఈ ఏడాది ఏప్రిల్ 12వ తేదీన ఇంటర్మీడియెట్ ఫలితాలు వెలువడ్డాయి. ఇప్పటికి దాదాపు 73 రోజులు అవుతోంది. అయితే డిగ్రీ ప్రవేశాలపై మాత్రం స్పష్టత లేదు. ఈ నెల 18న ఇంటర్ ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ ఫలితాలు కూడా వెలువడడంతో ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో పలువురు డిగ్రీలో చేరేందుకు ఎదురు చూస్తున్నారు. ఏటా ఇంటర్ ఫలితాలు విడుదలైన వెంటనే డిగ్రీలో ప్రవేశాలకు విధి విధానాలను ఉన్నత విద్యామండలి రూపొందించి, నోటిఫికేషన్ జారీ చేస్తోంది. దీని ప్రకారం ఆయా కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతూ వచ్చాయి. గత ఏడాది సైతం జూన్ 20న అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. సకాలంలో అడ్మిషన్లు చేపట్టినప్పుడే అరకొరగా విద్యార్థులు కళాశాలల్లో చేరుతున్నారని, ఇక ఆలస్యంగా అయితే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందనే ఆందోళన కళాశాలల యాజమాన్యాల్లో వ్యక్తమవుతోంది.

గత ప్రభుత్వ హయాంలో ఆన్‌లైన్ అడ్మిషన్లు

గతంలో వైఎస్సార్‌సీపీ సర్కారు ఆన్‌లైన్ విధానంలోనే డిగ్రీ అడ్మిషన్లకు శ్రీకారం చుట్టింది. అంతకు ముందు డిగ్రీలో ప్రవేశాలకు ఆఫ్‌లైన్ విధానం ఉండడంతో పట్టణ ప్రాంతాల్లోని కళాశాలలకు డిమాండ్ ఎక్కువగా ఉండేది. పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉండే కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య అరకొరగా ఉండేది. దీంతో వెనుకబడిన విద్యార్థులు చాలా నష్టపోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2021 నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్లను చేపట్టడంతో విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపులు జరిగేవి. ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు ఉన్న కళాశాలల్లో చాలా సులువుగా సీట్లు దక్కాయి. ఈ క్రమంలోనే జగనన్న విద్యాదీవెన సమర్థవంతంగా అమలు చేయడంతో గత ఐదేళ్లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు.

పట్టించుకోని ప్రస్తుత సర్కారు..

డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లపై ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే భావన కళాశాలల యాజమాన్యాల్లో వ్యక్తమవుతోంది. ఏపీ మంత్రుల పోర్ట్‌ఫోలియోలో విద్యాశాఖ అని పేర్కొనకపోవడంతో ఈ శాఖ ఎవరికీ కేటాయించలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రభుత్వం ప్రత్యేకంగా మానవ వనరుల అభివృద్ధి శాఖగా పేర్కొంటూ ఇందులో పాఠశాల విద్య, ఉన్నతవిద్య, అక్షరాస్యత పెంపు లాంటి అంశాలను చేరుస్తూ మంత్రిగా నారా లోకేష్‌కు బాధ్యతలను సీఎం చంద్రబాబు కేటాయించారు. ఈ క్రమంలో ఉన్నత విద్యామండలి అధికారులతో చర్చలు జరిపి డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసే దిశగా నారా లోకేష్ ఇప్పటివరకు చొరవ చూపకపోవడంతో సర్వత్రా గందరగోళం నెలకొంది. తనకిచ్చిన శాఖల పట్ల నారా లోకేష్ పూర్తిస్థాయి అవగాహనకు వచ్చిన తర్వాత అధికారులతో చర్చలు జరిపి చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నట్లు భావిస్తున్నారు. దీంతో డిగ్రీ అడ్మిషన్లను ఆఫ్‌లైన్‌లో చేపట్టాలా? లేకా ఆన్‌లైన్ విధానాన్నే కొనసాగిస్తారా ? అనే అంశం తేల్చుకోలేక ఉన్నత విద్యామండలి సందిగ్ధంలో పడింది. దీంతో ప్రైవేట్ విద్యాసంస్థలు పలు రకాల కోర్సులతో విద్యార్థులకు గాలం వేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు అన్యాయం



“డిగ్రీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం వల్ల వేలాదిమంది విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ఇంటర్మీడియెట్ ఫలితాలు వచ్చి ఇన్ని రోజులైనా ఇప్పటికీ అడ్మిషన్లపై అయోమయ పరిస్థితి ఉండడం తొలిసారి చూస్తున్నాం. విద్యార్థులను ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు. దీనిపై పలుమార్లు ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– నవీన్,
ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

ఆందోళనకు దిగుతాం



డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి ఇంతవరకు నోటిఫికేషన్ జారీ చేయకపోవడం దారుణం. ప్రభుత్వానికి ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదు. పిల్లల భవిష్యత్‌తో ఆడుకుంటే సహించం. నోటిఫికేషన్ ఆలస్యం వల్ల విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళనకు దిగుతాం.

– ప్రవీణ్,
విద్యార్థి సంఘం నాయకుడు, చిత్తూరు జిల్లా

న్యూస్‌రీల్

ఏపీ ఆర్-సెట్ ఇంటర్వ్యూలు ప్రారంభం



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ : యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి చేపట్టిన ఏపీ ఆర్‌సెట్-2024 ఇంటర్వ్యూల ప్రక్రియ ఎస్వీయూ మంగళవారం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 12 యూనివర్సిటీలకు సంబంధించి ఇంటర్వ్యూల ప్రక్రియ ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగనుంది. అందులో భాగంగా కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎడ్యుకేషన్, అడల్ట్ ఎడ్యుకేషన్, ఉర్దూ, సంస్కృతం, హిందీ, ఇంటర్నేషనల్ ఏరియా స్టడీస్, జువాలజీ సబ్జెక్టులకు సంబంధించిన ఇంటర్వ్యూలు ఆయా విభాగాలలోనే నిర్వహిస్తున్నారు. సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు, కో-కన్వీనర్ ప్రొఫెసర్ హేమ పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఇంటర్వ్యూలు పూరైన వెంటనే ర్యాంకులను కేటాయించనున్నట్లు కన్వీనర్ వెల్లడించారు.

రేపటి నుంచి చిరుధాన్యాలపై జాతీయ సదస్సు

తిరుపతి సిటీ : ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, భారత వ్యవసాయ పరిశోధన మండలి, హైదరాబాద్ జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎమ్‌ఆర్) ఆధ్వర్యంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఏడీఆర్ డాక్టర్ సుమతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతుడు తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఎస్వీ వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. హైదరాబాదులోని ఐఐఎమ్‌ఆర్ శాస్త్రవేత్తలు హాజరవున్నట్లు వివరించారు.

30లోపు అభ్యర్థుల లెక్క పద్దు



మాట్లాడుతున్న నోడల్ అధికారి చరణ్ రుద్రరాజు

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తాము ఖర్చు చేసిన మొత్తాలకు పద్దులను ఈ నెల 30వ తేదీలోపు సమర్పించాలని డీఆర్‌ఓ పెంచల కిషోర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులకు ఖర్చుల వివరాలను తెలియజేయాలని సూచించారు. జిల్లా ఎన్నికల వ్యయ నోడల్ అధికారి చరణ్ రుద్రరాజు మాట్లాడుతూ ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులే కాకుండా పోటీ చేసిన ప్రతి ఒక్కరూ ఖర్చుల వివరాలను చెప్పాలని స్పష్టం చేశారు.

నెలాఖరున 51 మంది టీచర్ల ఉద్యోగవిరమణ

తిరుపతి అర్బన్ : జిల్లాలో ఈ నెల 30వ తేదీన 51 మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందనున్నారు. సాధారణంగా ఒక్కో డిపార్ట్‌మెంట్‌లో ఒకరో ఇద్దరో ప్రతి నెలా ఉద్యోగ విరమణ పొందుతుంటారు. అయితే విద్యాశాఖకు సంబంధించి ఒకే సారి ఏకంగా 51 మంది రిటైర్డ్ అవుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచడంతో రెండేళ్ల క్రితమే రిటైర్డ్ కావాల్సి వీరంతా ఇప్పటి వరకు కొనసాగారు.

నేటి నుంచి ఏపీ ఈ-సెట్ కౌన్సెలింగ్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా ఏపీ ఈసెట్-2024 కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కో-ఆర్డినేటర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులందరూ ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు తమ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే హెల్ప్‌లైన్ సెంటర్‌కు రావాలని కోరారు. జూలై 1 నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని, 5న మార్పులు చేర్పులకు అవకాశముంటుందని, 8వ తేదీన సీట్ అలాట్‌మెంట్ చేస్తామని వివరించారు. వివరాలకు ''ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్'' వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. స్పెషల్ కేటగిరి (పీహెచ్, ఎన్‌సీసీ, క్యాప్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, ఆంగ్లో ఇండియన్స్, స్కౌట్స్ అండ్ గైడ్స్)అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత, తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో జూలై 2, 3వ తేదీల్లో విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సంప్రదించాలని సూచించారు.

పరిశీలన.. వినతుల స్వీకరణ



హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

శాంతిపురం/ కుప్పంరూరల్ : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా మంగళవారం కుప్పం పర్యటనకు విచ్చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు స్థానిక పీఈఎస్ మెడికల్ కళాశాల ఆవరణకు చేరుకున్న ఆయనకు మంత్రులు, ఎమ్మెల్యే, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం శాంతిపురం మండలం జెల్లిగానిపల్లెకు వెళ్లిన సీఎం చంద్రబాబు హంద్రీ-నీవా కాలువను పరిశీలించారు. అధికారులు కాలువ రూట్ మ్యాప్‌ను చూపుతూ పూర్తిస్థాయిలో పనులు, స్థితిగతులను క్షుణ్ణంగా వివరించారు. అక్కడి నుంచి ముఖ్యమంత్రి బయలుదేరి 7వ మైలు వద్ద నిర్మిస్తున్న తన సొంత ఇంటి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు, ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ క్రమంలో కుప్పం బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ కుప్పం అభివృద్ధికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పుకొచ్చారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుని టీడీపీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. బుధవారం పీఈఎస్ కళాశాల ఆడిటోరియంలో అధికారులతో సమీక్షించనున్నారు. అనంతరం కార్యకర్తలు, నేతలతో సమావేశం కానున్నారు.

• ధన్యోస్మి



తుమ్మలగుంట గ్రామంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ముందుగా ఆలయం వద్ద యాగశాలలో కైంకర్యాలు సమర్పించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి దంపతులు పాల్గొన్నారు. – తిరుపతి రూరల్

ఆక్రమణ అసత్యం

- 17 చోట్ల ఆర్టీసీ స్థలాలు కబ్జా చేశామనడం అవాస్తం
- 4 ప్రాంతాల్లో దరఖాస్తు చేస్తే రెండింటికి మాత్రమే లీజు
- మార్కెట్ ధర కంటే ఎక్కువగానే చెల్లించి నష్టపోయాం
- వాటిని కూడా రద్దు చేయాలని కోరుతున్నాం
- చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : ఆర్టీసీ స్థలాలను తాము కబ్జా చేశామని, ఇతరులను బెదిరించి టెండర్ దక్కించుకున్నామని కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు అసత్యమని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ''రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ స్థలాలు కబ్జా చేసామన్నది అవాస్తవం.. అధిక ధరకు కోట్ చేసిన వారిని బెదిరించామన్నది పచ్చి అబద్ధం.. 17 చోట్ల ఆర్టీసీ స్థలాలు ఆక్రమించుకున్నామని చెప్పడం అసత్యం.. చట్ట ప్రకారం ఆర్టీసీ అధికారులు వారి ఆధీనంలోని ఖాళీ స్థలాలను లీజుకు ఇవ్వడానికి నోటిఫికేషన్ జారీ చేస్తే.. పీలేరు, తెనాలి, అద్దంకి, ఒంగోలు ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్నాం. అయితే రెండు చోట్ల (అద్దంకి, ఒంగోలు) మాత్రమే అనుమతులు వచ్చాయి. అవి కూడా అందరికన్నా ఎక్కువ కోట్ చేసినందుందుకే వచ్చాయి. ఎక్కడా ఎవరినీ బెదిరించి తీసుకోలేదు. లీజు అనుమతి వచ్చిన తర్వాత అక్కడ కోట్ చేసిన ధర చెల్లించడం సాధ్యం కాదని అర్థ కావడంతోనే పనులు కూడా చేపట్టలేదు. ఆ రెండు చోట్లా లీజు అనుమతులు రద్దు చేసుకోవడానికి కూడా సిద్ధంగానే ఉన్నాం. ఆ విషయం కూడా ఆర్టీసీ అధికారులకు వివరించాం. అద్దంకి బస్టాండు సమీపంలో లీజు అనుమతి వచ్చిన స్థలంలో ఎలాంటి నిర్మాణ పనులు చేయలేదు. అయినప్పటికీ గత ఆరు నెలలుగా నెలకు రూ.లక్ష చొప్పున అద్దె చెల్లిస్తున్నాం. ఒంగోలు ఆర్టీసీ బస్టాండు వద్ద స్థలానికి 2లక్షలా30వేల రూపాయలకు మేము కోట్ చేశాం. మరొకరు 2లక్షల 30 వేల 500లకు కోట్ చేశారు. మాకూ వాళ్లకి కేవలం 500 రూపాయలు తేడా ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు ఎక్కువ కోట్ చేసిన వారికే లీజు అనుమతులు ఇచ్చారు. ఆ తర్వాత నెల రోజులకు ఆర్టీసీ అధికారుల నుంచి మాకు ఓ లెటర్ వచ్చింది. మొదటగా కోట్ చేసిన వారు డిపాజిట్ చెల్లించనందున రెండో స్థానంలో కోట్ చేసిన మాకు అవకాశం ఇస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. దాంతో ఒంగోలు ఆర్టీసీ బస్టాండు స్థలాన్ని నిబంధనల ప్రకారమే తీసుకున్నాం. ఆర్టీసీ స్థలాల లీజు విషయంలో చట్ట ప్రకారం వెళ్లామే తప్ప ఎక్కడా రూల్స్ అతిక్రమించలేదు. ఆర్టీసీ నిబంధనల మేరకు తీసుకున్న అద్దంకి, ఒంగోలులోని ఆర్టీసీ స్థలాలు తప్ప మరెక్కడా మాకు లీజు భూములు లేవు. ఆ రెండు స్థలాలు కూడా లీజు ధర ఎక్కువ కావడంతో ప్రతి నెలా అద్దె చెల్లించలేక నష్టపోతున్నాం. వాటి లీజులను కూడా రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం'' అంటూ మోహిత్ రెడ్డి పేర్కొన్నారు.

గంగమ్మకు మరు పొంగళ్లు



విశేషాలంకరణలో గంగమ్మ



ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

- ముత్యాల అలంకరణలో అమ్మవారు
- పెద్దసంఖ్యలో మొక్కులు చెల్లించుకున్న భక్తులు

తిరుపతి కల్చరల్ : తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అత్యంత భక్తిప్రపత్తులతో మరు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ముత్యాల అలంకరణలో కొలువుదీరిన గంగమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తిరుపతి గంగ జాతర అనంతరం ఐదు మంగళవారాలు అమ్మవారికి మరు పొంగళ్లు సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆఖరి మంగళవారం పెద్దసంఖ్యలో భక్తులు తమ కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. కోరిన కోర్కెలు తీరుస్తూ.. కొంగు బంగారంగా విలసిల్లుతున్న గంగమ్మకు ప్రణమిల్లారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో ఆలయం కిక్కిరిసింది. ఈ సందర్భంగా వేకువనే అమ్మవారి మూలవిరాట్టుకు విశేష అభిషేకం చేశారు. అనంతరం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు నిర్వహించే ముత్యాల పల్లకి సేవ తరహాలో వెంకన్న చెల్లెలు శ్రీతాతయ్యగుంట గంగమ్మను ముత్యాలతో సర్వాంగ సుందరంగా అలంకకరించి కొలువుదీర్చారు. జాతర మొక్కుబడి వేషాలతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అంబళ్లు పోసి ,ప్రసాదాలు వితరణ చేశారు. ఈఓ కె.మమత పర్యవేక్షించారు.



వివిధ వేషధారణల్లో కళాకారులు

కళాకారుల వేషాల సందడి

శ్రీతాతయ్యగుంట గంగమ్మ మరు పొంగళ్ల నేపథ్యంలో చివరి మంగళవారం రాయలసీమ రంగస్థలి కళాకారులు వివిధ వేషాలు ధరించి సందడి చేశారు. నవదుర్గలు, తిరుమల వెంకన్న, ఆంజనేయస్వామి తదితర దేవతా మూర్తుల వేషాలు ధరించి భక్తులకు కనువిందు చేశారు.

క్లుప్తంగా

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని కొరిడి గ్రామంలో ఆర్టీసీ బస్సు మంగళవారం అదుపు తప్పింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. గ్రామస్తుల వివరాల మేరకు.. సూళ్లూరుపేట నుంచి తీర ప్రాంత గ్రామాలు కొరిడి–పేర్నాడు ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకుని ఉదయం 8.30 గంటలకు బయలుదేరింది. కొరిడి గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి బస్సు రోడ్డు పక్కకు దిగడంతో బురదలో ఇరుక్కుపోయాయి. వాహనం ముందుకు కదలకపోవడంతో అప్రమత్తమైన బస్సు డ్రైవర్, కండక్టర్లు ప్రయాణికులను సురక్షితంగా వాహనం నుంచి కిందకు దింపేశారు. గత కొన్నేళ్ల నుంచి తిప్ప గ్రామం నుంచి పేర్నాడు వరకు రోడ్డు మార్గం సరిగా లేదు. కొరిడి, దాములరాయి, కటపత్రి మూడు పంచాయతీలకు గానూ 27 గ్రామాలకు రాకపోకలు చేయాలంటే ఈ రోడ్డు మార్గమే దిక్కు. గత 50 ఏళ్ల నుంచి అటవీశాఖ చట్టం రోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా మారింది. అప్పటి ఎమ్మెల్యే పెసల పెంచలయ్య అటవీశాఖ అధికారులతో మాట్లాడి మట్టి రోడ్డు వేయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ తీర ప్రాంత గ్రామాలకు మట్టి రోడ్డే దిక్కు. అయితే వర్షాలకు మట్టి రోడ్డులో రాళ్లు తేలి గుంతలమయంగా మారుతోంది. గత పదిరోజుల నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తుండంతో రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి.

విత్తనం.. పక్కాగా విక్రయం

- లైసెన్స్ పొందిన దుకాణాల్లో కొనుగోలు చేయడం ఉత్తమం
- అమ్మకాలకు రశీదులు తప్పనిసరి
- ఎమ్మార్పీ ధరలకే ఎరువులు
- నాణ్యమైన పురుగు మందులే పంపిణీ చేయాలి
- కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు
- వ్యవసాయశాఖ అధికారుల ఆదేశాలు



విత్తనాలు



పురుగు మందులు

తిరుపతి అర్బన్ : ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇదే తరుణంలో ప్రైవేట్ దుకాణాల్లో సైతం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని ఆయా షాపుల నిర్వాహకులు మోసాలకు పాల్పడకుండా వ్యవసాయశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో విత్తన చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతుకు ఎలాంటి అన్యాయం జరిగినా ఈ చట్టం ద్వారా విక్రయించి డీలర్లపై కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఎరువుల కృత్రిక కొరత సృష్టిస్తే ఊరుకోమంటూ హెచ్చరిస్తున్నారు. లైసెన్స్ పొందిన దుకాణాల నుంచి మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

మోసగిస్తే చర్యలు

విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా డీలర్లపై కఠినమైన చర్యలు చేపట్టే వీలుంది. విత్తన చట్టం–1966, విత్తన నిబంధనలు–1968, విత్తన నియంత్రణ–1983 చట్టాల ఆధారంగా అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించేలా విత్తన చట్టం రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడే వారిపై ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు జరిమానా విధించవచ్చు. ప్రైవేట్ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్స్ ప్రదర్శించాలి. లేకుంటే ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలను నిలిపివేయవచ్చు. డీలర్ షిప్‌ను సైతం రద్దు చేయవచ్చు.

జిల్లాలో లైసెన్స్ పొందిన షాపుల సమాచారం	
విత్తన దుకాణాలు	120
పురుగు మందుల షాపులు	282
ఎరువుల దుకాణాలు	234

ధరలు, స్టాకు బోర్డు తప్పనిసరి

విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. లేకుంటే ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేయవచ్చు. లేదా డీలర్ షిప్ రద్దు చేయవచ్చు.

రశీదు ఇవ్వాల్సిందే..

విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలి. లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 9 ప్రకారం సదరు దుకాణదారుడికి ముందుగా నోటీసు జారీ చేసి దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్స్‌ను సస్పెండ్, లేదా రద్దు చేయవచ్చు.

లేబుల్ లేకపోతే..

ప్రైవేటు దుకాణంలో కొనుగోలు చేసిన విత్తనాల బస్తాలకు లేబుల్ లేకపోతే విత్తనచట్టం–1966 సెక్షన్ 7 ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. ఆయా విత్తనాలను జప్తు సైతం చేయవచ్చు.అత్యవసర సరుకుల చట్టం–1955 సెక్షన్ 7 ప్రకారం జరిమానా విధించవచ్చు. కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే డీలర్ లైసెన్స్ సస్పెండ్ లేదా రద్దు చేయవచ్చు.

నిబంధనలు తప్పనిసరి



విత్తన చట్టానికి అనుగుణంగా డీలర్లు విత్తనాలను విక్రయించాలి. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాతో పాటు దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తాం. యూరియా కొరత సృష్టించినా చర్యలు తప్పవు. ఎమ్మార్పీ ధరలకే అమ్ముకోవాలి. లైసెన్స్ లేకుండా విక్రయిస్తే కేసులు ఉంటాయి. మండల వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు డీలర్ల దుకాణాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి.

– ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, తిరుపతి

రెండు బైక్‌లు ఢీకొని..

- యువకుడు మృతి



మృతి చెందిన మధు

వెంకటగిరిరూరల్: ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా మరో మోటారు సైకిల్‌పై ఉన్న దంపతులు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ఘటన వెంకటగిరి రూరల్ మండలంలోని వెంకటగిరి–నాయుడుపేట మార్గంలోని మొగళ్లగుంట వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెట్లూరు గ్రామానికి చెందిన దత్తూరు మధు(18) యువకుడు తన బైక్‌పై వెంకటగిరికి వెళ్తున్నారు. ఈక్రమంలో నాయుడుపేట మండలం తుమ్మూరుకు చెందిన పండి కీర్తిరాజు, శిరీష దంపతులు తమ బైక్‌పై వెంకటగిరి నుంచి నాయుడుపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో రెండు బైక్‌లు మొగళ్లగుంట వద్ద అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈఘటనలో మధు, కీర్తిరాజు, శిరీష తీవ్రంగా గాయపడగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలిస్తుండగా మార్గమధ్యలో మధు మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మధు మృతదేహాన్ని వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెట్లూరులో విషాదఛాయలు..

రోడ్డు ప్రమాదంలో యువకుడు మధు మృతి చెందడంపై పెట్లూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉన్న ఒక్క కొడుకు పసితనంలోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు స్థానికులను కలిచి వేశాయి.

ఎర్రచందనం కేసులో ముగ్గురికి జైలు



శిక్ష పడిన ముగ్గురు నిందితులు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో ముగ్గురికి ఆరు నెలలు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం సెషన్స్ కేసుల విచారణ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2016 జనవరి మూడో తేదీ పుత్తూరు ఆర్డీఎం థియేటర్ సమీపంలో ఒక కారులో చెన్నై ,సెవెన్ హిల్స్‌కు చెందిన ఎంఎస్ హమీద్, పిచ్చాటూరు మండలం, కీలపూడికి చెందిన ఏ.దిలీప్ కుమార్, తమిళనాడు, తిరువల్లూరు జిల్లా, ఊతుకోట తాలూకా పూదం పక్కం గ్రామానికి చెందిన సి గుణశేఖర్ నాలుగు ఎర్రచందనం దుంగలను కారులో తరలిస్తుండగా పుత్తూరు ఫారెస్ట్ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి పుత్తూరు మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ముగ్గురికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2000 చొప్పున జరిమానా విధిస్తూ 2018లో తీర్పు చెప్పారు. ఆ తీర్పుపై ముగ్గురు నిందితులు స్పెషల్ కోర్టులో అప్పీలు దాఖలు చేశారు. ఇరువైపుల వాదనల విన్న న్యాయమూర్తి కింది కోర్టు విధించిన శిక్షను ముగ్గురికి ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు

మాదవ ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హరికృష్ణ

కోట: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వాకాడు సీఐ హరికృష్ణ సూచించారు. కోటలోని శ్రీప్రగతి డిగ్రీ కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై పోలీసులు విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమైందన్నారు. కష్టపడి చదువుకుని తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటికి చాలాదూరంగా ఉండాలన్నారు. వాటి వల్ల కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు, యువత చెడుస్నేహాల కారణంగానే జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. అటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఎస్‌ఐ నాగబాబు, ఎస్‌ఈబీ ఎస్‌ఐ జయరావు, కళాశాల కరస్పాండెంట్ కిషోర్ పాల్గొన్నారు.

లీవ్ అడిగిన పాపానికి..

- చిన్న పాండూరు పీహెచ్‌సీలో వింత ఘటన
- వైద్యాధికారిని సెలవు అడిగిన అటెండర్ పుష్ప
- డాక్టర్ వర్సెస్ సిబ్బందిగా మారిన వివాదం
- డాక్టర్ లావణ్యపై శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సిబ్బంది

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి లావణ్య, సిబ్బంది నడుమ వివాదం చిలికిచిలికి గాలివానలా మారుతోంది. దీంతో అటెండర్ పుష్ప, ల్యాబ్ టెక్నీషియన్ నీరజ మంగళవారం వైద్యాధికారిణి లావణ్యపై శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనారోగ్య కారణాలతో లీవ్ కోసం అటెండర్ పుష్ప విన్నవించుకోగా పట్టించుకోక పోవడంతో తన భర్త ద్వారా టెలిఫోన్‌లో వైద్యాధికారిణిని మరోమారు విన్నవించే ప్రయత్నం చేశారు. అయితే అటెండర్ పుష్ప వ్యక్తిగత విషయాల గురించి ఆమె భర్తకు వైద్యాధికారిణి లావణ్య చెడుగా చెప్పడంతో కుటుంబంలో వివాదం తలెత్తింది. దీంతో మూడు రోజుల క్రితం పుష్ప భర్త, భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు పంపేశాడు. ఈ విషయమై ఆధారాలతో సహా పోలీసులకు అందజేసి న్యాయం కోసం అటెండర్ పుష్ప ఫిర్యాదు చేసింది. అలాగే హాస్పిటల్‌లోని ల్యాబ్ టెక్నీషియన్ నీరజతో కూడా దురుసుగా ప్రవర్తించడం, తరచూ విధుల నిర్వహణలో తన పట్ల భేదాభిప్రాయంతో వ్యవహరిస్తోందని, వీరిద్దరూ శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ గౌస్‌పీర్‌ను వివరణ కోరగా పీహెచ్‌సీ డాక్టర్‌పై రెండు ఫిర్యాదులు అందాయని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్వీయూలో అంతర్గత బదిలీలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో బోధనేతర సిబ్బంది అంతర్గత బదిలీలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు వీసీ శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఫైనాన్స్ విభాగంలో ఏఏఓగా పనిచేస్తున్న బి.కవితను ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ సైన్స్‌కు బదిలీ చేశారు. రిజిస్ట్రార్ కార్యాలయ ఏఏఓ టీవీఎస్ లక్ష్మీనారాయణను ఫైనాన్స్ విభాగానికి, భౌతిక శాస్త్ర విభాగంలో పనిచేస్తున్న గ్రేడ్–ఏ టైంస్కేల్ ఉద్యోగి డి.మధుసూదన్ నాయుడును రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేశారు. వీరితో పాటు మరో ఎనిమిది మందికి స్థానచలనం కలిగించారు. ఇప్పటికే వీసీ చాంబర్‌లోని సిబ్బందిని సైతం బదిలీ చేసి కొత్తవారిని నియమించారు.

అక్రమార్కులపై ఉక్కుపాదం



అధికారుల సమావేశంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : జిల్లావ్యాప్తంగా ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణాతోపాటు గంజాయి విక్రయాలు సాగిస్తున్న వారిపై ఉక్కు పాదం మోపాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. మంగళవారం తిరుపతిలోని పోలీస్ అతిథిగృహంలో జిల్లా సబ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు పెంచాలని సూచించారు. ఈ క్రమంలోనే సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. గంజాయి విక్రయాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హోం మంత్రి ఆదేశాల మేరకు మత్తు పదార్థాల రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రతి ఒక్కరు కష్టపడాలని కోరారు. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించాలని, గ్రామస్తులతో సమావేశమై స్థానిక సమస్యలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. కేసులను సత్వరమే దర్యాప్తు చేసి కచ్చితమైన ఆధారాలతో చార్జిషీట్‌లు దాఖలు చేయాలన్నారు. అరెస్టుల విషయంలో పెండింగ్ లేకుండా పనిచేసి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కోర్టులో నేర నిరూపణ చేసి నేరస్తులకు శిక్ష పడేలా సాక్ష్యాలను సేకరించాలన్నారు. పదేపదే గంజాయి కేసుల్లో పట్టుబడిన ముద్దాయిలపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని ఆదేశించారు. మిథనాల్, మొలాసిస్ రవాణాపై సైతం ప్రత్యేక నిఘా ఉంచాలని, వాటిని చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఉపయోగించకుండా చూడాలని స్పష్టం చేశారు. సమావేశంలో సబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర పాల్గొన్నారు.


భక్తులకు పారదర్శకంగా 'వసతి'



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామల రావు

తిరుమల : తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు పారదర్శకంగా వసతి కల్పించాలని టీటీడీ ఈఓ జె.శ్యామల రావు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం గోకులం విశ్రాంతి భవనంలో జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మంతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమలలో ఎన్ని గదులు అందుబాటులో ఉన్నాయి, ఎంత మంది యాత్రికులకు వసతి కల్పించవచ్చు అనే అంశాలను వివరించారు. డిపాజిట్ రీఫండ్ దళారులను గుర్తించడంతో పాటు వారిని నియంత్రించే మార్గాలు, తిరుపతిలో అందుబాటులో ఉన్న వసతి, కొత్తగా నిర్మాణంలో ఉన్న పీఏసీలు తదితర అంశాలపై ఈఓ సమీక్షించారు. అనంతరం పదే పదే వసతి పొందుతున్న వారి వివరాలు, గదులు సక్రమంగా ఖాళీ చేయకపోవడం, ఇతర సమస్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో వసతి విభాగం డిప్యూటీ ఈఓలు హరీంద్రనాథ్, భాస్కర్, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, ఐటీ జీఎం సందీప్ రెడ్డి, ఓఎస్‌డీ సత్రే నాయక్, ఏఈఓ వెంకటేశ్వర్లు నాయుడు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి(సైదాపురం): అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటగిరిలో నిర్వహించనున్న ఆల్ ఇండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీల కరపత్రాలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆవిష్కరించారు. మంగళవారం నర్రా విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించగా అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణరావు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 77,878 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.46 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

విధుల్లోకి అకడమిక్ కన్సల్టెంట్లు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో మంగళవారం 23 మంది అకడమిక్ కన్సల్టెంట్లు విధుల్లో చేరారు. తాత్కాలిక అధ్యాపకులుగా పని చేస్తున్న వీరిని 2019లో ఉద్యోగాల నుంచి తొలగించారు. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించిన కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. తొలగించిన 23 మంది అకడమిక్ కన్సల్టెంట్లను 11 నెలల గడువుతో విధుల్లోకి తీసుకోవాలని పేర్కొంది. మంగళవారం ఈ మేరకు కోర్టు ఆదేశాలను ఆయా విభాగాల అధిపతులు, ప్రిన్సిపాళ్లకు సమర్పించి అకడమిక్ కన్సల్టెంట్లు విధుల్లో చేరారు.

ఆలయం కూల్చివేతపై ఫిర్యాదు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కుందేటివారి వీధిలో నిర్మిస్తున్న గంగమ్మ ఆలయాన్ని కూల్చివేసిన శ్రీనివాస్‌శెట్టిపై స్థానికులు మండిపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేయాలని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో పలువురికి గాయాలు






కారు ఢీకొనడంతో గాయపడిన తండ్రీ, కొడుకులు

దొరవారిసత్రం: వేర్వేరు ప్రమాదాల్లో పలువురు గాయపడిన సంఘటనలు మంగళవారం పలుచోట్ల చోటు చేసుకున్నాయి. దొరవారిసత్రం మండలంలో ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక వస్తున్న ఓ కారు ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న తండ్రీ కొడుకులు గాయపడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. వాకాడు ఎస్సీ కాలనీకి చెందిన పుచ్చలపల్లి కిరణ్(30), కొడుకు సందీప్(05)తో కలిసి బైక్‌పై సూళ్లూరుపేట మండలం ఉగ్గుముడి గ్రామం నుంచి స్వగ్రామానికి వస్తుండగా కుప్పారెడ్డిపాళెం వచ్చేసరికి వెనుకే వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కిరణ్ అతని ఐదేళ్ల కుమారుడు సందీప్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట 108 అంబులెన్స్ ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ఈఎంటీ సాల్మన్‌రాజు, పైలట్ కోటేశ్వరావు ప్రథమ చికిత్స అందించి నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో..



ప్రమాదంలో గాయపడిన సోయల్

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని మర్లపల్లి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఓ ఆటో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సోయల్‌తో పాటు సంతోష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరుకు చెందిన సంతోష్, తన భార్య పిల్లలతో కలసి మంగళవారం ఆటోలో శ్రీకాళహస్తి ఆలయానికి వెళ్లి వస్తున్నాడు. నాయుడుపేట దాటిన తరువాత జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించబోయి ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సోయల్, సంతోష్ గాయపడడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ఉన్న సంతోష్ భార్య, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయపడ్డారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.